క్లుప్తంగా

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

పార్వతీపురంటౌన్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రూపేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండల స్థాయి అధికారులంతా పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సాలూరు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నకుమారి అన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ఆదివారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు లోను కావడం వలన జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వారాంతపు పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

సీతానగరం: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని గాదెలవలస ఉన్నత పాఠశాల హెచ్ఎం శంకర రావు అన్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వారాంతపు పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 242 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారిలో 8 మంది వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. వారికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఒక గంట సమయం పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు జి.శ్రీనివాస రావు, పి.రామకృష్ణ ఉన్నారు.

పాడిరైతుల ప్రయోజనాలు కాపాడాలి



రైతులతో మాట్లాడుతున్న పాడి రైతుల సంఘం అధ్యక్షుడు రెడ్డి రమణమూర్తి

సీతానగరం: విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల సేకరణ ధరలు పెంచాలని కోరుతూ విశాఖపట్నంలోని గాజువాక సమీపంలో ఉన్న డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో పాడిరైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని పాడిరైతుల సంఘం అధ్యక్షుడు రెడ్డి రమణమూర్తి కోరారు. ఆర్.వెంకంపేటలో ఆదివారం పర్యటించి పాడిరైతులతో మాట్లాడారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధరను లీటరుకు రూ.35 నుంచి రూ.32కు తగ్గించిందని, దీని వల్ల శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో సుమారు 3.50 లక్షల మంది పాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాల రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చేపట్టే ధర్నాలో పాడిరైతులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పాడి రైతులు రెడ్డి తవిటినాయుడు, పెంట సన్యాసినాయుడు, పెంట దామోదర్, పెంట రాము, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి అవకాశం లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడే చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. పట్టణ అంతర్గత రహదారులపై వర్షపునీరు ప్రవహించడంతో శివారు ప్రాంతాల్లో బురద పేరుకుపోయింది. నగర పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టకుంటే సీజనల్ జ్వరాలు, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త



- నాణ్యత లేని చిరుతిండ్లు
- చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- తనిఖీలు నిర్వహించని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు



హోల్‌సేల్ దుకాణాల వద్ద మూటలతో ఉన్న స్నాక్స్ ప్యాకెట్లు

బలిజిపేట: చిన్నారుల నుంచి పెద్దల వరకు చిరుతిండ్లకు అలవాటుపడని వారు లేరు. స్నాక్స్ అంటే లొట్టలేసుకుని తింటారు. స్నాక్స్ తయారీలో ప్రముఖ కంపెనీలకు చెందిన లేస్, కుర్కురేలకు నకిలీలు తయారైపోతున్నాయి. చిన్న అక్షరం మార్పులతో ఇవి మార్కెట్‌లో విరివిగా దొరుకుతున్నాయి. ఈ నకిలీ చిరుతిండ్లు హోల్‌సేల్ వ్యాపారుల నుంచి గ్రామాల్లోని చిన్నపాటి దుకాణాల ద్వారా విచ్చలవిడిగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నాణ్యత లేని స్నాక్స్ తిన్న పలువురు చిన్నారులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.

హానికర రసాయనాల వాడకం

స్నాక్స్ తయారీ ఒక ఎత్తు అయితే వాటి ప్యాకింగ్ ఎంతో ఆకర్షణీయంగా ఉండేలా వ్యాపారస్తులు చూసుకుంటారు. దీంతో చిన్నపిల్లాడు ఆకర్షణీయంగా కనిపించే ప్యాకెట్ కోసం మారాం చేసి దానిని కొనుగోలు చేస్తున్నాడు. ప్యాకెట్‌లో ఉండే చిరుతిండిలో నాసిరకం కారం పొడి, ఉప్పు, రసాయనాలను కలుపుతారు. కొన్నింటిలో టేస్టింగ్ సాల్ట్ కలపడంతో చిన్నతనం నుంచి ఆరోగ్యం గుల్ల అవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విషయంలో వైద్యులు తల్లితండ్రులను హెచ్చరిస్తున్నా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే చెప్పవచ్చు.

చిన్నపాటి మార్పులు

బ్రాండెడ్ కంపెనీలకు చెందిన పేరుతో ఉన్నట్లే చిన్నపాటి మార్పుతో ఈ స్నాక్స్ ప్యాకెట్లను తయారుచేస్తుంటారు. దీంతో అసలు ఏవి, నకిలీ ఏవి అని చిన్న పిల్లలు వాటిని తెలుసుకోలేరు.

రూ.లక్షల్లో వ్యాపారం

గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వ్యాపారం రూ.లక్షల్లో సాగుతోంది. స్నాక్స్ ప్యాకెట్లలో చిన్నచిన్న బొమ్మలు పెట్టడంతో చిన్నారులు వాటి కోసం వీటిని కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. పాఠశాలలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు వీటిని కొనుగోలు చేసి వాటిలో వచ్చే బొమ్మలను చూసి ఆనందిస్తారు తప్పా వాటి వెనుక ఉండే ప్రమాదాన్ని గుర్తించరు. దీంతో నకిలీ స్నాక్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

తనిఖీల్లేవు

ఇటువంటి ప్యాకెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నా వాటిపై అధికారుల పర్యవేక్షణ కానరావటం లేదు. దుకాణాల్లో కాని, తయారుచేసే చోట కానీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో ఈ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చిల్లర దుకాణాల వద్ద విక్రయానికి పెట్టిన తోరణాలు

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం
- ఐదు నెలల్లో రెండుసార్లు పెంచిన విద్యుత్ చార్జీలు
- ప్రజలను మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి తన మార్కు నయ వంచనతో తానిచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ మరోసారి ప్రజల నడ్డి విరిచాడని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ధ్వజమెత్తారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ అంటూ ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక 'బాబు ష్యూరిటీ- ప్రజలపై బాదుడు గ్యారంటీ' అన్నట్లుగా పరిస్థితి తయారైందని విమర్శించారు.

ఎన్నికలకు ముందు పెంచమన్నారు.. ఇప్పుడు నడ్డి విరుస్తున్నారు

ఎన్నికలకు ముందు చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే గతంలో పెంచినవి కూడా తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి సర్కారు అధికారంలోకి రాగానే ఎడా పెడా కరెంట్ చార్జీలతో వీరబాదుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడన్నారు. అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే రెండోసారి ట్రూఅప్ చార్జీల భారం మోపాడన్నారు. ఈ చార్జీలను యూనిట్‌కు రూ.1.27 చొప్పున నవంబరు నెల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. తాజా చార్జీలతో కలిపి జనవరి నుంచి యూనిటు రూ.2.19 అదనంగా వినియోగదారులు చెల్లించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలపై అదేపనిగా విరుచుకుపడిన ఎల్లో మీడియా.. విపరీతంగా దుష్ప్రచారం చేసిన చంద్రబాబు హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టి ప్రజలను మోసం చేయడంలో బ్రాండ్ అంబాసిడర్‌గా మారారనన్నారు. ట్రూఅప్ చార్జీల పేరతో ఈ ఆరునెలల కాలంలోనే రూ.15,485.36 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు.

సామాన్యుడు బతికే పరిస్థితులు లేవు

ప్రజలకు తమ ఆదాయాలను చంద్రబాబు సిండికేట్లకు సమర్పించుకోవాల్సిన పరిస్థితి. ఈ ఖర్చులు భరించలేక ఇప్పటికే ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. వాటికి తోడు ఇప్పుడు కరెంటు చార్జీలు కూడా అమాంతంగా పెంచేశారన్నారు. సామాన్యుడు బతికే పరిస్థితులు రాష్ట్రంలో కనిపించడం లేదన్నారు. ఈ ఖర్చులు భరించలేక కుటుంబాల ఆదాయాల సంగతి పక్కనపెడితే అప్పులు ఇబ్బడి ముబ్బడిగా చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అందుకే కాల్‌మనీ గ్యాంగులు ఇప్పుడు ఊళ్లల్లో, పట్టణాల్లో స్వైర విహారం చేస్తున్నాయన్నారు. అధిక వడ్డీలకు ప్రజలకు బలైపోతున్నారని, వారి జీవితాలన్నీ అస్తవ్యస్తం అయిపోయాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ సిద్ధ జగన్నాథరావు, కౌన్సిలర్ రణబేరి చిన్నంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి శేఖర్, పెండ రమణ, ఎస్.శ్రీనివాసరావు, వై.గోపాల్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పల వెలమల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న చుక్క భాస్కరరావు

పార్వతీపురం: కొప్పల వెలమ సంక్షేమానికి సంఘంలోని సభ్యులంతా అంకిత భావంతో పనిచేయాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు చుక్క భాస్కరరావు అన్నారు. పట్టణంలోని సీఎస్ఎన్ వేదికలో సంఘ జిల్లా అధ్యక్షుడు కెల్లారపు రమేష్‌నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొప్పల వెలమలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ప్రతీ ఒక్కరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రస్తుతం పట్టణంలో కొప్పల వెలమ సంఘం భవన నిర్మాణం చురుగ్గా జరుగుతోందన్నారు. సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉండేందుకు సభలు, సమావేశాలను తరచూ నిర్వహించుకోవాలన్నారు. ఈ నెల 15న కొప్పల వెల మ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కొప్పల వెలమ సంఘం నూతన డైరెక్టర్లుగా ఎంపికైన అక్కేన మధుసూదనరావు, గొట్టాపు వెంకటనాయుడులను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ట్రెజరర్ మరిశర్ల కార్తీక నాయుడు, ప్రధాన కార్యదర్శి చొక్కాపు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



వీరఘట్టం: మండల కేంద్రంలోని కోటదుర్గ అమ్మవారికి కార్తీక అమావాస్య కావడంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ కుదలి వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

- వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్

పార్వతీపురంటౌన్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు రెండుసార్లు పెంచడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇది కేవలం కార్పొరేట్ విధానాలను పెంచి పోషించడమేనని మండిపడ్డారు. అదానీ అక్రమాలు ప్రపంచానికి తెలిసినప్పటికీ మన రాష్ట్రంలో బాబు, పవన్ ఆయనకు కవచంలా నిలిచారని, ఇది రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహాన్ని తలపెట్టినట్లేనన్నారు. వెంటనే రూ.17 వేల కోట్ల ట్రూఅప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని, ట్రూఅప్ విధానాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి ఎన్నికల వాగ్దానాని అమలు చేయాలని, కేంద్రం విద్యుత్ సవరణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని, పెట్టిన స్మార్ట్ మీటర్లు తొలగించాలని, ఎస్సీ, ఎస్టీ, వృత్తి దారులందరికీ 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని, ఆర్థిక నేరానికి పాల్పడిన అదానీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బి.నర్సింగరావు, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం (లిబరేషన్) నాయకులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పి.రంజిత్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.అవినాష్, వై.మన్మథరావు, వి.ఇందిర, కె.గంగునాయుడు, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతికే ధాన్యం

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యమే కారణం
- ఇంతవరకు 500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- సాగు పెట్టుబడులకు అందని ప్రభుత్వ సాయం



కూర్మరాజుపేటలో ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముతున్న రైతులు

సాలూరు రూరల్:

ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతలు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతుల్లో దగాకు గురవుతున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం అందించకపోవడంతో దళారులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి పంటలు సాగుచేశారు. పండిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి అప్పు తీర్చేద్దామని భావించారు. కానీ ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే పంటను దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభంలోనే రైతుభరోసా పేరుతో పెట్టుబడి సాయం అందించేది. ఏడాదికి మూడు విడతల్లో రూ.13500 చొప్పున సాయం అందించేది. అలాగే రైతులకు విత్తనాలు, ఎరువులను రాయితీ ధరకు అందించడంతో పాటు పండిన పంటను ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేది. దీంతో రైతులు ఆర్థికంగా లాభపడేవారు. సంతోషంగా సాగు చేసుకునేవారు.

ఇంతవరకు 500 మెట్రిక్ టన్నుల సేకరణ

మండలంలో ఎనిమిది ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశారు. అయితే అప్పటికే రైతులు పంటకోతలు, నూర్పులు పూర్తిచేశారు. ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించే వరకు కళ్లాల్లో వాటిని భద్రపరచలేక తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్మకాలు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం క్వింటాకు రూ.2300 మద్దతు ధర ప్రకటించగా ప్రైవేటు వ్యాపారులు రూ.2150లు చెల్లిస్తున్నారు. వారే గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలను చూసుకుంటున్నారు. పైగా రైతుల కళ్లాల వద్దకే వచ్చి ధాన్యం సేకరిస్తుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే ధాన్యం విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఇప్పటి వరకు 500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు అధికారులు చెపుతున్నారు.

కొనుగోలు కేంద్రం ఎప్పుడు తెరుస్తారో తెలీదు



ధాన్యం కోసే ముందు మామిడిపల్లి సచివాలయానికి వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని ధాన్యం కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారని అడిగితే తమకు తెలియదని చెప్పారు. ఈ లోగా ప్రైవేటు వ్యాపారిని కలిసి డబ్బులు తీసుకున్నాం. వారికే ధాన్యం ఇస్తున్నాను. సచివాలయాలు గతంలో మాదిరిగా పనిచేయడం లేదు.

– మెల్లిక నరసింహులు, రైతు, మడతనవలస గ్రామం

500 మెట్రిక్ టన్నులు కొనుగోలు

ఇప్పటి వరకు 8 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలు రైతులు ముందుగా చెల్లిస్తే వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది. రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 48 గంటల్లో ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది.

– అనురాధ, మండల వ్యవసాయాధికారి

వ్యాపారుల వద్ద పెట్టుబడికి డబ్బులు తీసుకున్నాం



వ్యాపారుల వద్ద వ్యవసా య పెట్టుబడులకు ముంద స్తుగా డబ్బులు వాడుకున్నాం. ఇప్పుడు వారికి ఇవ్వకపోతే మాట తప్పిన వారమవుతాం. అందుకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నాం. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందేది. ఈ ప్రభుత్వం ఇంతవరకు రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. అందుకే వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

– మెల్లిక తవుడు, రైతు, మడతనవలస గ్రామం

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి

- సీపీఐ(ఎంఎల్) స్టాండింగ్ కమిటీ సభ్యుడు బొద్దు వాసుదేవరావు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఐ(ఎంఎల్) స్టాండింగ్ కమిటీ సభ్యుడు బొద్దు వాసుదేవరావు డిమాండ్ చేశారు. ప్రజా హక్కులపై పోరాటం చేసేందుకు డిసెంబర్ 4న విజయవాడలోని జింఖానా మైదానంలో నిర్వహించే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలిసి కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతులు కల్పనతో ఉపాధి అవకాశాలు పెరుగుపడతాయనే నమ్మకంతో ప్రజలు కూటమికి ఓటు వేసి అధికారం అప్పగించారని, కానీ కూటమి ప్రభుత్వం కార్పొరేట్ బాసులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. పేద, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, యువకుల సమస్యలను విస్మరించిందని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా గత పదేళ్లుగా మోడీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలతో ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజా సంపద దోచుకోవడం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, రాజ్యాంగ ఉల్లంఘనలు, న్యాయవ్యవస్థతో పాటు ఇతర రాజ్యాంగ వ్యవస్థలపై ఆధిపత్యం కోసం వాటి స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయడం, ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడం, హిందుత్వం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం, అసమ్మతివాదులను తప్పుడు కేసులలో నిర్బంధించడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిపంకర్ భట్టాచార్య, సీపీఐఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

సీతంపేట: గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు డీఎస్సీ నుంచి తమ పోస్టులు మినహాయించాలని కోరారు. సంఘ నాయకులు బిడ్డిక గణేష్, ఎస్.మోహనరావు, బి.ధర్మారావు పాల్గొన్నారు.